శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## శేషవాహనంపై కోదండరాముడు



**బుచ్చి మార్చి 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని సీతాలక్ష్మణసమేతుడైన కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు శేషవాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు.స్వామి వారిని గజమాలలతో అత్యంత సుందరంగా అలంకరించారు. గ్రామోత్సవంలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పరవశించారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడుతు కనిపించింది.ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు

## హంసవాహనంపై కోదండరాముడు



**బుచ్చి మార్చి 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరాముని ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు హంసవాహనోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు.స్వామి వారు కృష్ణావతారంలో హంసవాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు.గ్రామోత్సవంలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి, పర్యవేక్షించారు.

## ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో టిప్పర్ కింద పడి యువకుడు మృతి



**కావలి, మార్చి 31 ప్రభాతవార్త** కావలి పట్టణం రౌండ్‌దిక్లాక్ జనసంచారం కల్గిన ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో శుక్రవారం మధ్యాహ్నం టిప్పర్ కింద పడి యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆ ప్రాంతాన్ని కలిచివేసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. ఓ క్రషర్‌కు చెందిన టిప్పర్ ఓవర్ బ్రిడ్జి మీద నుంచి దిగుతుండగా సమీపంలో మోటార్‌బైక్ మీద కూర్చోని వున్న వేములపాటి హరికృష్ణ (23) టిప్పర్ ఢీకొట్టింది. టిప్పర్ చక్రాల కింద పడి హరికృష్ణ తల నుజ్జునుజ్జు అయింది. జనం చూస్తుండగా జరిగిన ఈ సంఘటన అందరిని భయకంపితుల్ని చేసింది. కావలి పట్టణ వెంగళరావునగర్‌కు చెందిన వేములపాటి హరికృష్ణ మృతితో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. సంఘటన ప్రదేశానికి కావలి డిఎస్పీ వెంకట రమణ, సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తరలివచ్చారు. జరిగిన సంఘటనను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రక్తహీనతతోనే మరణాలు

**నెల్లూరు మార్చి 31, ప్రభాతవార్త-వైద్యం** జిల్లాలో మాత శిశు మరణాలు రక్తహీనతల వలనే జరుగుతున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయంలో మాతా శిశుమరణాలపై సమీక్షా సమావేశం పెంచలయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల సంభవించిన రెండు మాతా శిశుమరణాల కారణాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. సైదాపురం, చాకిచర్ల పీహెచ్‌సీలకి సంబంధించి రాజేశ్వరి, సరస్వతిలు గర్భధారణ సమయంలో ఆశించిన స్థాయిలో బరువు పెరగనుందున కార్డియాక్, శ్వాస సంబంధిత సమస్యలతో చనిపోయినట్లు గుర్తించడం జరిగిందన్నారు. వివిధ కారణాలతో చనిపోయిన శిశు మరణాలపై కూడా కమిటీ సభ్యులు విశ్లేషించుకున్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కవితావసుంధర, డాక్టర్ ఇందిర, డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ సింధుజ, గైనకాలజిస్ట్‌లు డాక్టర్ హేమంత్‌కుమార్, పిడియాట్రిస్ట్ డాక్టర్ ఐవి.రామచంద్రరావు, జనరల్ ఫిజీషియన్ భూలోకమ్మ, జిల్లా కోఆర్డినేటర్ పవన్‌కుమార్, డాక్టర్ బ్రిజిత, బి.శ్రీనివాసరావు ఐసీడిఎస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎవరు పోటీపడినా గెలిచేది నేనే : ఎమ్మెల్యే అనీల్



**నెల్లూరు సిటీ, మార్చి31, ప్రభాతవార్త** రానున్న ఎన్నికల్లో తనకు పోటీగా ఎవరు నిలబడ్డా గెలిచేది మాత్రం వైసిపి పార్టీ తరుపున తానేనని మాజీమంత్రి నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.నెల్లూరు సిటీ 9వ డివిజన్ బంగ్లాతోట యలమలవారిపాలెం తదితర ప్రాంతాల్లో స్థానిక నేతలతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం 97వ రోజు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు.స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లపాటు ప్రజలను వారి ఇబ్బందులను పట్టించుకోని వారు ఎన్నికలు సమీపిస్తుండడంతో పర్యటిస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే ఎన్నికల్లో గెలవరని ప్రజల ఆదరాభిమానాలు ఉంటేనే గెలుస్తారని తెలిపారు.ఎవరిని గెలిపించాలో ప్రజలకు బాగా తెలుసన్నారు. పార్టీలు మారే వారిని,పొత్తులు పెట్టుకునే వారిని సైతం ప్రజలు గమనిస్తుంటారని జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం లో ప్రజలు ఆశీస్సులతో తాను ఎమ్మెల్యేగా గెలుస్తానన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ ఇంచార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు నగరంలో పలు స్పాసెంటర్లలో పోలీసుల తనిఖీ



**నెల్లూరు క్రైమ్, మార్చి31, ప్రభాతవార్త** నెల్లూరు నగరం దర్గామిట్ట ప్రాంతంలో స్పా సెంటర్ పేరుతో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్న రోస్ కింగ్ స్పా అండ్ సెలూన్‌లో తనిఖీలు నిర్వహించి పలువురు యువతులను అదుపులోకి తీసుకున్న నెల్లూరు 4వ నగర పోలీసులు.ఇప్పటివరకు నెల్లూరు నగరంలోని పలు స్పా సెంటర్‌ల నుండి 6గురు యువతులు,6గురు విటులు,ఇద్దరు నిర్వహకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.ఈ రైడ్‌లో టౌన్ డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఐడీపార్టీ డిఎస్పీ,పలువురు సీఐలు,ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌డిజి సర్వేని తనిఖీ చేసిన ఉన్నతాధికారి

**బిట్రగుంట, మార్చి 31 ప్రభాతవార్త** బోగోలు మండలంలో శుక్రవారం గ్రామ వార్డు సచివాలయాలకు చెందిన సెక్రటరియేట్ ఉన్నతాధికారి అశోక్ పలు సచివాలయాలలో ఎస్‌డిజి సర్వేని తనిఖీ చేశారు. మండలంలోని బోగోలు బిట్3, విశ్వనాధరావుపేట బిట్ 2, కోవూరుపల్లి సచివాలయాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సచివాలయ సిబ్బంది సేకరించిన డేటాను ఆయన పరిశీలించారు. ఆయా సచివాలయాలలో పరిధిలో గర్భవతులు, 5 సంవత్సరాల లోపు పిల్లల పోషక సామర్థ్యం, రక్తహీనత వంటి వాటిపై వారు సేకరించిన సర్వే వివరాలు, పొందుపర్చిన జాబితాను తనిఖీ చేశారు. ఇటీవల గ్రామ వార్డు సచివాలయాలలో ఎస్‌డిజి ప్రాజెక్టు కింద వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు ఈ వివరాలపై సమగ్రంగా సర్వే చేస్తున్న విషయం విధితమే.

# రబీలో 4.25లక్షల ఎకరాలకు సాగునీరు



**నెల్లూరు అర్బన్, మార్చి31, ప్రభాతవార్త** జిల్లాలో రెండో పంట రబీకి సంబంధించి సోమశిల,కండలేరు జలాశయాల పరిధిలో 4.25లక్షల ఎకరాల ఆయకట్టకు 46టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో తీర్మానించినట్లు రాష్ట్ర వ్యవసాయ,సహకార,మార్కెటింగ్,ఫుడ్ ప్రొసెసిగ్ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించాడు.శుక్రవారం ఉదయం నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ,జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు,జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబు రెడ్డితో కలిసి రాష్ట్రవ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా స్థాయి సలహామండలి సమావేశం నిర్వహించారు.తొలుత రెండో పంటకు సంబంధించి సోమశిల,కండలేరు జలశాయాల్లో నిల్వ ఉన్న నీటి పరిమాణం,కనుపూరు కాలువ,కావలి కాలువ, జేకేఎన్‌కాలువ,దక్షిణ కాలువ వంటి ప్రధాన కాలువలకు సాగునీటి విడుదలకు ప్రతిపాధించిన నీటి పరిమాణం వంటి వివరాలను ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్ వివరించగా,జిల్లాలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు,ఇటీవల అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులకు సంబంధించి చేపడుతున్న నష్టనివారణ చర్యలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు క్లుప్తంగా వివరించారు.అనంతరం కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదని,ఈసారైనా పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు.ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి మట్లాడుతూ మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి గ్రామ,మండల, నియోజకవర్గ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని,ప్రధానంగా బిందు,తుంపర్ల సేద్యం పనిముట్ల కోసం ఎలా ధరఖాస్తు చేసుకోవాలి,సబ్సిడీ ఎంత మేర వస్తుంది అనే విషయాలను రైతులకు అర్థమయ్యేలా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.అలాగే రానున్న వర్షాకాలంలోపు సోమశిల జలాశయ పటిష్టతను సంబంధించి అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ రెండో పంటకు పుష్కలంగా నీరు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు.జిల్లాలో ఉన్న రెండు రిజర్వాయర్లో నీరు అందుబాటులో ఉందని వెల్లడించారు. రైతులందరూ తక్కువ నీటి వినియోగంతో పండే చిరు ధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం శుభపరిణామమన్నారు.అనంతరం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సాగునీరు,వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో ప్రజాప్రతినిధులు,రైతులు సూచించిన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. సచివాలయ స్థాయి, మండల, జిల్లా,రాష్ట్ర స్థాయి వ్యవసాయ సలహామండలిని ఏర్పాటు చేసి రైతు సమస్యలపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. ఈ ఏడాది మంచి గిట్టుబాటు ధర మార్కెట్‌లో లభిస్తుందని చెప్పారు.ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతాగాన్ని ఆదుకుంటామని చెప్పారు.ఈ సమావేశం అనంతరం ఎమ్మెల్సీగా పనిచేసి పదివీకాలం ముగిసిన వాకాటి నారాయణరెడ్డిని సమావేశంలో అందరూ సత్కరించారు.ఈ సమావేశంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, వాకాటి నారాయణరెడ్డి,కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి,జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్,రైతుసంఘాల నాయకులు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శంఖవరంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ



**వింజమూరు ,మార్చి31ప్రభాతవార్త:** వింజమూరు మండలం శంఖవరం గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు కర్రలు, ఇటుకరాళ్ళతో దాడిచేసుకున్న సంఘటనలో 7మంది గాయాలపాలయ్యారు. ఈసంఘటన పై కలిగిరి సిఐ సాంబశివరావ్ మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని ఉభయం తీసుకెళుతున్న సమయంలో ఇరువర్గాల వారు వాదోపవాదాలకు దిగి ఒకరిపై ఒకరు కర్రలు, ఇటుకరాళ్ళతో దాడి చేసుకున్నారన్నారు. గురువారం రాత్రి స్వల్ప వివాదం జరగడంతో ఎస్ఐ జంపానికుమార్ శంఖవరం వెళ్ళి ఇరువర్గాల వారిని హెచ్చరించి వచ్చారన్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం జరిగిన దాడిలో సర్పంచ్ వర్గానికి చెందిన సానం గంగిరెడ్డి ,లింగాలదిన్నె రవీంద్రరెడ్డికి తీవ్ర గాయాలైనాయి. మరో వర్గానికి చెందిన నంబూరు శ్రీనివాసులురెడ్డి, లెక్కల సాయిరెడ్డి, నంబూరు సుబ్బారెడ్డి, లెక్కల సుమన్ లకు గాయాలు కావడంతో వారిని చికిత్సకై ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గంగిరెడ్డిని, రవీంద్రరెడ్డికి వింజమూరులో ప్రథమచికిత్స చేసి మెరుగైనవైద్యం కోసం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు . ఈసంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశామని, గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నా మన్నారు. గతంలో కూడా ఇరువర్గాలపైన కేసులు నమోదై ఉన్నాయన్నారు. జిల్లా ఎస్పీ, డియస్పీల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఎలాంటి వివాదాలున్నా పోలీసులకు సమాచారం అందించి సత్వర న్యాయం పొందాలన్నారు. గ్రామంలోనే మహిళాపోలీసులు, వాలంటీర్ల దృష్టికి తీసుకెళ్ళాలని వారు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామంపై ముందుగానే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గొడవలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

# పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించిన ఎస్పీ



**నెల్లూరు క్రైమ్, మార్చి31, ప్రభాతవార్త** నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ విజయరావు. ల్లాలోని పోలీస్ సిబ్బది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి పోలీస్ వెల్ఫేర్‌డే నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వహించాలని,అనధికారకంగా గైర్హాజరు అవుతూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీలను స్వయంగా స్వీకరించి,సమగ్రంగా విని,వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. బదిలీలు,డిజర్షన్,సస్పెషన్ నుండి విధులకు తీసుకోవడం,ప్రమోషన్,బదిలీలు,సర్వీసు సంబంధిత సమస్యలు,గ్రూడ్ ఇంక్రిమెంట్,డిప్యూటేషన్ సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు సంబంధిత అర్జీలు స్వీకరించారు.వృత్తి పరమైన,ఆరోగ్యపరమైన సమస్యల అర్జీలపై సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సత్యకుమార్ హత్యకు పన్నాగం



**నెల్లూరు మార్చి 31, ప్రభాతవార్త-వైద్యం** భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్‌పై దాడి ఒక పథకం ప్రకారమే జరిగిందని, ఇది ముమ్మాటికీ హత్య చేసేందుకు పన్నాగంలో భాగమేనని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే వారిపై భౌతిక దాడులు, హత్యలకు పాల్పడడం ఈ రాష్ట్రంలో వైసీపీ నేతలకు ఆనవాయితీగా మారిపోయిందని భారతీయ జనతా పార్టీ నమో గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల.రమేష్, జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి.భరత్‌కుమార్‌యాదవ్‌లు ధ్వజమెత్తారు. శుక్రవారం నగరంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో బీజేపీ అధ్యక్షుడు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుళ్ళూరు వెళ్ళి అమరావతినే రాజధానిగా చెయ్యాలని తుళ్ళూరు రైతులు చేపట్టిన ఉద్యమాన్ని ప్రారంభించిన విషయం విధితమే. ఆ ఉద్యమం పన్నెండు వందల రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వారు రైతులు అన్ని పార్టీల వారిని తమకు మద్ధతు ఇవ్వమని పిలుపునివ్వడంతో సత్యకుమార్ వారికి మద్ధతు తెలిపేందుకు తుళ్ళూరు వెళ్ళడం జరిగిందని వివరించారు. సత్యకుమార్ రైతులకు మద్ధతు తెలిపి, తిరిగి విజయవాడకి వెళ్తున్న దారిలో మందడం గ్రామం వద్ద సత్యకుమార్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌ని ఆపడం జరిగిందని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రేరేపించిన కొంతమంది వ్యక్తులు సత్యకుమార్, ఆదినారాయణలపై దాడి చేయడం వైసీపీ నేతల నీచ సంస్కృతికి దర్పణమన్నారు. వైసీపీ గూండాలు, నందిగామ ఎంపీ సురేష్ ప్రేరణతో ఈ దాడి చేశారని అర్థం చేసుకోవచ్చున్నారు. అనంతరం పోలీసులే బీజేపీ నేతలు, కార్యకర్తలను రెక్కలు విరిచిపట్టుకోవడం, వైసీపీ గూండాలు రాళ్ళతో కొట్టడం జరిగిందని, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని, ఈ దాడికి చట్టం, ప్రజాస్వామ్యం, శాంతి భద్రతలను కాపాడాల్సిన హక్కు పోలీసు డిపార్టుమెంటు మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా హత్యాయత్నం కేసులో ప్రధాన ముద్దాలుగా పోలీసులను చేర్చాలని వారు డిమాండ్ చేశారు. వైసీపీ నేతల దాడికి సత్యకుమార్ వాహనం పూర్తిగా ధ్వసం అయిందన్నారు. కొంతమంది బలంగా ఉన్న బీజేపీ కార్యకర్తలను మరీ చెట్ల చాటుకు తీసుకువెళ్ళి దారుణంగా కొట్టారని మండిపడ్డారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైసీపీ ఏర్పడిన తరువాత ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను, జగన్‌ని విమర్శిస్తే ప్రతిపక్షం, సామాన్యుడు అనే తేడా లేకుండా వారిపై ప్రతి దాడులకు దిగుతున్నారని, ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందో లేదో అనే అర్థం కాని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారన్నారు. సత్యకుమార్‌పై దాడి చేయించిన జగన్‌కి రాబోవు రోజుల్లో ప్రజాగ్రహానికి గురి కాక తప్పదరి వారు హెచ్చరించారు. సత్యకుమార్‌పై దాడులే కాక వైసీపీ నేతలపై చేస్తున్న ప్రధానికి లేఖ రాసి, గవర్నర్, డీజీపీలకి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా వదలబోమని వారు వెల్లడించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైలు అక్కడే నిలబడి చోద్యం చూడడంలో ఈ పోలీసుల ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదన్నారు. అన్యాయాలు, అక్రమాలపై విమర్శిస్తే ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడడం దుర్మార్గం అని వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, మొగరాల.సురేష్, మండ్ల.ఈశ్వరయ్య, కందికట్ల.రాజేశ్వరమ్మ, దాసరి.ప్రసాద్, బాబు, కుడుముల.గిరికుమార్‌గౌడ్, ముని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్యశాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



**ఆత్మకూరు ,మార్చి31ప్రభాతవార్త:** ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల లో నూతనంగా నిర్మించిన బాలభవితకేంద్రం 500కె లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ , ఎస్ఎస్‌సియు విభాగాలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు , ఆత్మకూరు జిల్లా వైద్యశాల అధికారులు, ఆత్మకూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్‌సిపి నాయకులతో కలిసి ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గానికే కాకుండా సమీప నియోజకవర్గాలైన ఉదయగిరి , సర్వేపల్లి, వెంకటగిరి, బద్వేల్ నియోజకవర్గాల నుంచి నిత్యం రోగులు జిల్లా వైద్యశాలలో ఆరోగ్య పరిక్షల కోసం వస్తు ఉంటారని , వారందరికీ అందుబాటులో ఉండే విధంగా 17 విభాగాల్లో జిల్లా వైద్యశాల సేవలు అందిస్తుందని పేర్కొన్నారు.

100పడకల ఆసుపత్రిగా ఉన్న దీన్ని 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశారని , పెంచిన 50పడకలకు సంబంధించి అవసరమైన పరికరాలు, సిబ్బంది, భవన వసతికోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేసి ఉన్నామని అవి మంజూరై త్వరలోనే ఆసుపత్రికి రానున్నాయన్నారు. ఆసుపత్రి పరిశీలనలో భాగంగా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని పలువురు ఎమ్మెల్యే ద ృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు.

హైవే పక్కనే ఆసుపత్రి ఉండడంతో ఇక్కడ ట్రామాకేర్ సెంటర్ అత్యవసరమని, ప్రతిపాదనలు , అవసరమైన పరికరాలు , సిబ్బంది నివేదికను అందజేయాలని వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి మంజూరుకు కృషి చేస్తానన్నారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన బాలభవిత కేంద్రాలు నెల్లూరుజిల్లాలో రెండుమాత్రమే ఉన్నాయని, వాటిలో ఇకటి ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని వైద్యులను కోరారు. అనంతరం కంటివైద్య విభాగాన్ని పరిశీలించి రోగులను క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులను కంటి ఆపరేషన్లు ఎప్పుడు నిర్వహజంచారు.ఎలాంటి వైద్యం అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రోగులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అందజేసిన ఆహారపదార్థాలను వారికి అందజేశారు. ఈకార్యక్రమంలో డిసిహెచ్ఎస్ రమేష్‌నాథ్, డిఎంఅండ్‌హెచ్ఓ పెంచలయ్య, ఆత్మకూరు జిల్లా వైద్యశాల వైద్యులు , సిబ్బంది, వైసిపి నాయకులు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కావలి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎంపికైన నూతన కమిటీ




**కావలి, మార్చి 31 ప్రభాతవార్త** కావలి న్యాయవాదుల బార్ అసోసియేషన్‌లో అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగాయి. ఎలక్షన్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ఫలితాలు సాయంత్రం విడుదల చేశారు. కావలి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఐ.వి.రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రిషికుమార్, కార్యదర్శిగా ప్రకాష్, జాయింట్ కార్యదర్శిగా ప్రసాదు, కోశాదికారిగా శేషుప్రసాద్, లైబ్రేరియన్‌గా అభిషేక్, లేడీ రిప్రెంజిటెటీగా కోటా రాధలు ఎన్నికయ్యారు. నూతన కమిటీని కావలి సీనియర్ న్యాయవాది,మాజీ ఎజిపి పోట్లూరు శ్రీనివాసులు దుశ్శాలువాలతో, పూల మాలలతో సత్కరించి అభినందించారు.

## గడపగడపలో సమస్యలను గుర్తించండి




**చేజర్ల ,మార్చి31ప్రభాతవార్త:**గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను గుర్తించి నమోదు చేయాలని చేజర్ల ఎంపిడిఒ ఎన్.విజయలలిత పేర్కొన్నారు. శుక్రవారం చిత్తలూరు సచివాలయంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని అన్ని ఇళ్ళకు తిరిగి సమస్యలను గుర్తించాలన్నారు. గుర్తించిన సమస్యలకు త్వరిత గతిన పరిష్కార మార్గం చూపాలన్నారు. ఇటీవల ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి గ్రామంలో రివ్యూ నిర్వహించారన్నారు. మరలా గ్రామాల్లో తిరిగి సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆమె తెలిపారు. చిత్తలూరు మాజీ సర్పంచ్ మోదేపల్లి పెంచలనాయుడు , సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు 'అంకినపల్లి'ప్రోత్సాహకాలు



**వింజమూరు,మార్చి31ప్రభాతవార్త:** వింజమూరు మండలం గుండెమడకలకు చెందిన వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు , ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబులురెడ్డి తన స్వగ్రామానికి చెందిన విద్యార్థుల భవితపట్ల ప్రేమ, వాత్సల్యం, ప్రేమ, సహృదయం కలిగిన నేతగా వరుసగా ప్రోత్సాహకాలు అందిస్తూ మరోసారి మమకారాన్ని చాటుకొని గ్రామస్తుల అశేష ఆదరాభినాలను చూరగొంటున్నారు. అంకినపల్లి ఓబులురెడ్డి ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ శుక్రవారం గుండెమడకల జిల్లా బాలుర ఉన్నతపాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు నిర్వహించిన సరస్వతీ పూజకు హాజరై ఈసందర్భంగా 70మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులు పరిక్షలు బాగా వ్రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఇటీవల ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో జిల్లాస్థాయిలో 2వ స్థానంలో నిలిచిన ఎ.సాయితేజకు 2వేల రూపాయలు, మరో ముగ్గురు విద్యార్థులకు వెయ్యి రూపాయల వంతున 3వేల రూపాయలను అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బుర్రాల శ్రీనివాసులుయాదవ్ , భోగిరెడ్డి ఓబులురెడ్డి, ఉపాధ్యాయులు చెంచయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుడు సత్యకుమార్‌పై దాడి హేయనీయం



**వింజమూరు,మార్చి31ప్రభాతవార్త:**బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌పై జరిగిన దాడి హేయనీయమని బిజెవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీరాం శ్రీనివాస్‌పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిరక్షణా సమితి చేస్తున్న కార్యక్రమంలో 1200రోజులకు చేరిన నేపథ్యంలో మద్ధతు తెలపడానికి వెళ్ళిన జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌పై జరిగిన దాడినతీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. వ్యక్తిగత దాడులు పైశాచిక సంస్కృతిని తెలుపుతుందన్నారు. ఒక పథకం ప్రకారమే అధికారపార్టీకి చెందిన వారు పెద్ద పెద్ద రాళ్ళతో సత్యకుమార్ కారుపై, కాన్వాయిపై దాడి చేశారన్నారు. అల్లరిమూకలు దాడిచేస్తుంటే పోలీసుయంత్రాంగం సోధ్యం చూస్తుందన్నారు. భౌతికదాడులతో బిజెపి గళాన్ని అణచివేయాలని భావించిన రాష్ట్రంలోని అధికార ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు .

## రామచంద్రాపురంలో విద్యుత్ పనులు



**వలేటివారిపాలెం మార్చి 31, ప్రభాతవార్త** మండలంలోని అంకభూపాలపురం పంచాయతీలో శుకృవారం సర్పంచ్ పెంగడా ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో విద్యుత్ పనులు చేపట్టారు. విద్యుత్ బల్బులు వేయించడం, లూజ్ స్పాన్‌సరిచేయడం తదితర పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వైసీపీ నేత బాపతు మాలకొండారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో సమస్యలపై స్పందిస్తున్నట్లు తెలిపారు.

# పోషణ్అభియాన్ పథకం చిన్నారులకు వరప్రసాదిని



**కలిగిరి, మార్చి31, ప్రభాతవార్త:**.రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పోషక్‌పక్వాడ్, పోషణ అబియాన్ పథకాలు అంగన్‌వాడీ చిన్నారులకు వరప్రదాయిని లాంటిదని ఐసిడియస్ వింజమూరు ప్రాజెక్టు సిడిపిఓ సిహెచ్. పద్మజాకుమారి తెలిపారు. గురువారం కలిగిరి మండలంలోని అయ్యపరెడ్డి పాళెం అంగన్‌వాడీ సెంటర్లో పోషణ్ పక్వాడ్, పోషణ అబియాన్ కార్యక్రమంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.అంగన్‌వాడీ కార్యకర్తయస్. మాదవి ఈకార్యక్రమాలు నిర్వహించగా సిడపిఓ పద్మజాకుమారి ముఖ్య అతిదిగా హాజరై పైకార్యక్రమాలను తిలకించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సెంటర్లో బాలింతలు, తల్లులు, చిన్నారులు, గర్భవతులుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లల్లో సమయపాలన, రికార్డులపర్యవేక్షణ ముఖ్యమన్నారు.అదేవిధంగా కేంద్రాలకు చిన్నారులను అతిజాగ్రత్తగా తీసుకురావాలన్నారు. అదేవిధంగా చిన్నారుల శారీరక ఎదుగుదలతోపాటు వారి ఆరోగ్యం పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్దతీసుకోవాల న్నారు.మన ప్రభుత్వంకూడా ఇలాంటి చిన్నారులపట్ల అత్యంతశ్రద్ద కనపరుస్తుందన్నారు.కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టినపోషక్ పక్వాడ్, పోషణఅభియాన్ పథకాలు అంగన్‌వాడీ చిన్నారుల్లో సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు.పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అదించేవి దానం,గర్భవతులు ,బాలింతల సంరక్షణతోపాటునిరంతరం వారిని పర్యవేక్షణ చేసేవిదంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు.ఇందులో బాగంగా మార్చి23 నుండిప్రారంభమైనపోషణ్ పక్వాడ్‌పక్షోత్సవాలు ఏప్రేల్‌నెల 3వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు.గర్భవతులు, బాలింతలు సూక్ష్మ పోషకాలైన చిరుదాన్యాలతోకూడినఆహారాలు అధికంగా తీసుకోవాలని సిడిపిఓ చూసించారు. ఈకార్యక్రమంలో కలిగిరి సెక్టారు సూఫర్‌వైజర్ వి. హైమావతి, సెక్టారులోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముత్తుకూరు తహశీల్దార్ మనోహర్‌బాబు ఉద్యోగ విరమణ



**ముత్తుకూరు,మార్చి31,ప్రభాతవార్త** ముత్తుకూరు తహశీల్దార్‌గా పనిచేస్తున్న మనోహర్‌బాబు వచ్చిన తక్కువ కాలంలో మండల ప్రజల అందరి అభిమానాలు పొంది తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నారని,పంటపాలెం సర్పంచ్ ఆలపాక శ్రీనయ్య కొనియాడారు.శుక్రవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన పదవి విరమణ కార్యక్రమంవిఆర్వోల ఆధ్వర్యంలో జరిగింది. వివిధ పార్టీల నాయకులు,అభిమాను లు,మండల వాసులు హాజరై వారితో ఉన్న అను బంధాల గురించి సభలో మాట్లాడారు. ఆలపాక శ్రీనయ్య మాట్లాడుతూ తహశీల్దార్ కు నాకు 2012 నుండి అనుబంధం ఉందని ఎప్పుడు కనిపించినా ఆప్యాయంగా పలకరించేవారన్నారు.ప్రజా సమస్యలపై ఎవరైనా వస్తే ఆ సమస్యలను వెంటనే పరిష్కరించగల సత్తా కలిగిన మహోన్నత వ్యక్తి మనోహర్‌బాబు అన్నారు.ఇంకా సంవత్సరం ఉన్నప్పటికి పదవి విరమణ చేయడం చాలా భాదాకరంగా ఉందన్నారు.వారిని భగవంతుడు ఎల్లవేళలా ఆశీర్వదించాలని వారు కోరారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ మండల వాసులు తమను చాలా బాగా ఆదరించారని ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి విధులను తూచా తప్పకుండా చేసేలా సహకరించిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.విఆర్వోలు ఆయనకు జ్ఞాపికను అందజేశారు.మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరపు సుగుణ, మండల ఉపాధ్యక్షులు పోలిరెడ్డిచిన్న పురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సునీల్,ఎంపిడివో ప్రత్యూష,మారు సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బ్రహ్మానందం, రామ్మోహన్‌రెడ్డి, విఆర్ఏలు, పంచాయతీ కార్యదరు ్శలు తదితరులు పాల్గొన్నారు.

## విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



సైదాపురం మార్చి 31 ప్రభాతవార్త గ్రామ సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వాలింటరీలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసిల్దారు విజయలక్ష్మీ హెచ్చరించారు. మండల పరిధిలోని తుమ్మల తలుపూరు గ్రామంలో ఉన్న సచివాలయాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా రికార్డులను తనీఖి చేశారు.అనంతరం మాట్లాడుతు సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేకుండా సమయా పాలన పాటించకుంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందెలా విధులు నిర్వహించాలని తెలిపారు.

## అంగరంగ వైభవంగా దక్షిణంపేట రామాలయం రథోత్సవం





**కావలి, మార్చి 31 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని దక్షిణంపేట రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రథాన్ని మహిళలు, భక్తులు లాగారు. జై శ్రీరామ్ అన్న నినాదాల హోరులో ఈ రథోత్సవం సాగింది. మహిళల కోలాట నృత్యాలు, భజన బృందాల మధ్య రథోత్సవం సాగింది. ఈ రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు. కావలి వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు రథోత్సవంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భక్తులకు అవగాహన కల్పించారు. ఆయన ఆధ్వర్యంలో

# భూ ఆక్రమణలను ప్రోత్సహించడం సరికాదు: ఎమ్మెల్యే అనిల్



**నెల్లూరు సిటీ,మార్చి31,ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ అంబాపురం భూ ఆక్రమణల వివాదంలో మాజీమంత్రి నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ స్పందించారు.నెల్లూరు నగరం మైపాడు గేటు సమీపంలో జరుగుతున్న 4లైన్ రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్క రించేందుకు నిర్మిస్తున్న రోడ్డు పనులను 50శాతం పూర్తి అయ్యాయని తెలిపారు.మరో 3నెలల్లో మిగిలిని 50శాతంపనులు పూర్తి అవుతాయన్నారు.నగర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.తమ ప్రభుత్వ పాలనలో పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు అవుతున్నాయన్నారు.నిరుపేదలకు ఇప్పటికే 30వేల ఇళ్లస్థలాలను అందజేశామని తెలిపారు.స్థలాలు కావలసిన వారు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.నెల్లూరులో గతంలో ఎన్నడు లేని విధంగా భూ ఆక్రమణల పర్వంకొనసాగుతుందని ఇది మంచి పద్ధతి కాదన్నారు.ప్రభుత్వ భూముల ఆక్రమణను ప్రోత్సహించడం సరికాదన్నారు.అంబా పురం భూ వివాదం కోర్టులో నడుస్తుందని,భూమికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ప్రజా ప్రతినిధిగా భూ ఆక్రమణలను అడ్డుకున్న తనపై దళిత వ్యతిరేకిగా ముద్ర వేయడం సరికాదన్నారు.వివాదాస్పద భూమికి సంబంధించిన 100మంది దళిత కుటుంబాలకు ఇంటి స్థలాలను అందజేసే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవి చంద్ర,సంక్రాంతి అశ్విని,వైయస్ఆర్‌సిపి నాయకులు పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## హైవే రోడ్డుపై మట్టిని తీయించిన ఎస్ఐ నాగార్జునరెడ్డి



**సంగం మార్చి 31 ప్రభాతవార్త** సంగం మండలంలోని పెరమన సమీపంలో ముంబాయి రహదారిలో ఇటీవల తరచు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలాలలో నుండి ట్రాక్టర్లు రోడ్డుపైకి రావడంతో రోడ్డుపైన బంకమట్టి నిలిచిపోతున్నది.దీనిని గుర్తించిన ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో కలిసి రోడ్డుపైన ఉన్న మట్టి పెళ్లలంతా తొలగించారు.పలువురు వాహనాదారులు శభాష్ పోలీసులు అంటు ప్రశంసించారు.

## స్వచ్ఛ గ్రామాలకు పాలకవర్గాలు సహకరించాలి



**కోవూరు, మార్చి 31 ప్రభాతవార్త :** గ్రామాలు పూర్తిస్థాయిలో స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు పాలక వర్గాలు, సచివాలయ సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద కేంద్రంలో శుక్రవారం విడవలూరు, కొడవలూరు మండలాలకు సంబంధించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు చెత్త నుంచి సంపదను ఏ విధంగా తయారు చేసుకోవాలి.. ఏ విధంగా విక్రయించుకోవాలి.. ఏ విధంగా సేకరించాలి అనే విషయమై శిక్షణా శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి చెత్తను తడి చెత్త పొడి చెతనత రూపంలో సేకరించి, తడి చెత్త ద్వారా వర్మీకంపోస్టు తయారు చేసేందుకు దృష్టి పెట్టాలన్నారు. ఈ ఎరువును రైతులకు విక్రయించి పచాయతీ ఆదాయాన్ని పెంచుకు నేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు కూడా చెత్తాచెదారాలను తమ ఇష్టానుసారంగా ఎక్కడంటే అక్కడ పడవేయకుండా మీ ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి చెత్త , పొడి చెత్త రూపంలో వేరువేరుగా అందించాలన్నారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్‌లు శ్రీనివాసులురెడ్డి చెతనత నుంచి సంపద కేంద్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకునేందుకు వీలు ఉంటుందో ఆ విషయాలపై సమావేశంలో పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పచ్ డి. ప్రమీలమ్మ, ఈవోపీఆర్డీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రావు, తదితరులు ఉన్నారు.

## ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత ప్రతి విద్యార్థికి అవసరం




**కోవూరు, మార్చి 31 ప్రభాతవార్త :** పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమని, ఈ దశలోనే ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత సాధించాలనే పట్టుదల కలిగి ఉంటే విజయాలు మీ వెంటే పరుగులు తీస్తాయని రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్షుడు కె. శేఖర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశ యాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించాలనే దిశగా ముందుకు సాగాలన్నారు. రానున్న రోజుల్లో పదవ తరగతి తర్వాత ఏ సబ్జెక్ట్ తీసుకుంటే వారికి ఉపయోగకరంగా ఉంటుందో అనే విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన సదస్సును రోటరీ క్లబ్ ద్వారా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రొటేరియన్ కె. నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి నీ శక్తిని నీవు తెలుసుకోవడమే కాకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకం మీ ఆయుధమైతే ప్రపంచాన్ని సులువుగా జయించవచ్చున్నారు. చదువును ఆయుదంగా మలుచుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి మాట్లాడుతూ పరీక్షలంటే బెరుకుతనం పోవాలని, పరీక్షలను కూడా ఒక పండుగ వాతావరణంలా నిర్వహించాలని ఇటీవల ప్రదానమంత్రి నరేంద్రమోడీ కూడా మన్ కీ బాత్ కార్యక్రమంలో తెలియజేశారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జాయింట్ సెక్రటరీ టి. ఉదయ్ భాస్కర్‌రావు, రోటరీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తిరుపతి శేఖర్ పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు.

## మాజీ ఏపీపీకి మాతృవియోగం



**కోవూరు, మార్చి 31 ప్రభాతవార్త :** కోవూరు మాజీ ఏపీపీ గాదిరాజు భాస్కర్‌రావు మాతృమూర్తి గాదిరాజు నాగేశ్వరమ్మ గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల సలహాలు, సూచనల మేరకు సుబాష్ సేవా సంఘం అధ్యక్షులు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగేశ్వరమ్మ రెండు నేత్రాలను ప్రభుత్వ వైద్యశాల నేత్రదాతల మోటివేటర్స్ బాలాజీ సింగ్, లాలిష్ నేతృత్వంలో వాటిని సేకరించారు. అనంతరం వారి కుమారుడు అశోక్‌కుమార్‌కు పత్రాన్ని అందజేశారు.

## వైసీపీ ప్రభుత్వంలో మృతులకు కూడా ఉపాధి హామీ పనులు



**కోవూరు, మార్చి 31 ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వంలో చనిపోయిన వ్యక్తులు కూడా దివి నుంచి భువికి వచ్చి ఉపాధి హామీ పనులు చేస్తున్నారని, జిల్లాలో ఈ పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగు తు న్నాయని, ఈ పథకం అధికార పార్టీ నాయకులకు ఏటీఎంగా మారిందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి విమర్శించారు. కోవూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ అండతోనే ఈ పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్నారు. అనేక ప్రాంతాల్లో చనిపోయిన వ్యక్తులు, కాలేజీలో చదివే విద్యార్థులు, చివరకు ఆవా వర్కర్లు సైతం ఉపాది హామీ పనులు చేస్తున్నట్లు చూపి నిదులు స్వాహా చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టి ఈ పథకం కింద చేపట్టే పనులు మనుషులు మాత్రమే చేయాలని ఏర్పాటు చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో యంత్రాలతో పనులు చేసి మనుషలతో చేయిస్తున్నట్లు నమోదు చేస్తున్నారన్నారు. మొక్కలు నాటకుండానే నాటినట్లు, నీటి పారుదల కాలువలో పూడిక తీయకుండానే తీసినట్లు చూపించి నిధులు స్వాహా చేస్తున్నారన్నారు. ఈ పథకం కింద చేపట్టే పనులపై సోషల్ ఆడిట్ జరిగి అక్రమాలు వెలుగు చూస్తున్నా వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ పథకంలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వానికి సంబంధించిన మీడియాలోనే పెద్దఎత్తున కథనాలు వస్తున్నాయంటే జిల్లాలో ఈ పథకంలో ఏ విధంగా అక్రమాలు జరుగుతున్నాయో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ పథకంలో జరుగుతున్న అక్రమాలపై నిజాయితీగల అధికారులతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణరెడ్డి, రవికుమార్, గోపాల్, మురళీకృష్ణారెడ్డి, విజయ్, శ్రీహరి, నాసిర్, వేణు, వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి, రమణయ్య, తదితరులు ఉన్నారు.

## శ్రీ చైతన్య విద్యాసంస్థలో సరస్వతి పూజ

**అల్లూరు, మార్చి 31 ప్రభాతవార్త** నార్తుమోపూరు శ్రీ చైతన్య విద్యాసంస్థలో శుక్రవారం సరస్వతి పూజను ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం స్కూలు ఆవరణలో సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులందరూ పదవ తరగతి పరీక్షలు బాగా రాయాలని శ్రీ చైతన్య స్కూలు ప్రిన్సిపాల్ ఖాజారంతుల్లా, కరస్పాండెంట్ కె.శివకుమార్‌లు ఆశీర్వదించారు.

## మాజీ మంత్రి నారాయణ పరామర్శలు



**కోవూరు, మార్చి 31 ప్రభాతవార్త** : కోవూరుకు చెందిన సీనియర్ పార్టీ నా యకుడు గాదిరాజు అశోక్ కుమార్ మా తృమూర్తి నాగేశ్వరమ్మ మృతి చెందడం విధితమే. ఈ మేరకు శుక్రవారం కు టుంబ సభ్యులను మాజీ మంత్రి నారా యణ పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సమయంలోనే గుండెదిటవు చేసుకుని దైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. అనంతరం మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని తన సానుభూతిని తెలియజేశారు. దాదాపు అరగంట పాటు మాజీ మంత్రి వారి గృహంలోనే ఉండి యోగక్షేమాలను అడగడం గమనార్హం. నారాయణ విద్యాసంస్థల జీఎం విజయ్ భాస్కర్‌రెడ్డి, చాట్ల నరసింహారావు, గిరి, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, మండ పార్టీ అద్యక్షుడు మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఘనంగా సరస్వతి పూజ



కోవూరు, మార్చి 31 ప్రభాతవార్త : కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహానికి రుత్వికుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ హాల్ టికెట్‌లను ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి అందజేశారు. నూరుశాతం ఫలితాలే ధ్యేయంగా ప్రతి విద్యార్థి పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామ సర్పంచ్ డి. ప్రమీలమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలి



**కోవూరు, మార్చి 31 ప్రభాతవార్త** : దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న ప్రతి ఒక్కరూ క్రమం తప్ప కుండా ఆ రోగానికి సంబందించిన మందులను వాడాలని ఇనమడుగు ప్రాథమిక ఆ రోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవిబబు తెలి పారు. కోవూరులోని కోనమ్మతోటలో ఉన్న 5వ సచివాలయ ప్రాంతంలో శుక్రవారం ఫ్యా మిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డా క్టరన రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పా టు చేసిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, వారు దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## సిఆర్‌పాళెంలో సివిల్ రైట్స్‌డే



**బిట్రగుంట, మార్చి 31 ప్రభాతవార్త** బోగోలు మండలం చెన్నారాయునిపాళెం గిరిజన కాలనీలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. గిరిజన కాలనీలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వారి హక్కులను తెలియజేయడం, వివిధ శాఖల అధికారుల ద్వారా వారికి అందుతున్న సేవలు, స్థితిగతులపై గ్రామ సభ నిర్వహించారు. మండల డిప్యూటీ తహశీల్దార్ జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనీబాషాను సత్కరించిన విశ్వంభర ఛారిటబుల్ ట్రస్ట్



**కావలి రూరల్, మార్చి 31 ప్రభాతవార్త** హ్యాపీ సేవా సంస్థ చేస్తున్న పలు సేవా కార్యక్ర మాలు గుర్తించి శుక్రవారం నె ల్లూరు ప్రకాష్‌నగర్‌లో విశ్వం భర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో హ్యాపీ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషాకు మెమోంటో ఇచ్చి దుశ్సాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఘనీబాషా మా ట్లాడుతూ ఈ పురస్కారం నా ఒక్కడిది కాదని సంస్థ సభ్యు లందరి సమిష్టి కృషితో పొందడం జరిగిందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు దాతల సహాయ సహకారాలతో చేపట్టడం జరిగిందని అందరి కృషి ఫలితమే ఈ ప్రశంసలు అన్నారు. మా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తించి మాకు ఉత్సాహాన్ని నింపిన విశ్వంభర ఛారిటబుల్ ట్రస్ట్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ఉత్సాహంతో రాబోవు రోజుల్లో కూడా మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ పేద ప్రజలకు అండగా వుండి అందరి మన్ననల పొందుతామని తెలిపారు.

## వలస కూలీలకు అన్నదానం చేసిన టైంటుహెల్ప్ ట్రస్ట్

**కావలి రూరల్, మార్చి 31 ప్రభాతవార్త** టైం టు హెల్ప్ ట్రస్ట్ కావలి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.రమేష్ ఆధ్వర్యంలో వారి తల్లి స్వర్గీయ ఎన్.కొండమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా శుక్రవారం వలస కూలీలకు అన్నదానం చేశారు. కర్ణాటక రాష్ట్రం నుండి వలస కూలీలుగా వచ్చి కావలి సమీపంలోని ముసునూరు

**దస్తావేజు పోయినది**

నా క్లయింటు వింజం మాలకొండయ్య తండ్రి చెన్నయ్య ఇచ్చిన సంజాయిషీ మేరకు నా క్లయింటు మరియు వింజం మహేష్ ఇద్దరు కలసి రిజిష్టర్ సెటిల్‌మెంట్ పత్రము ద్వారా సంక్రమించిన భూస్థలము దాని లింకు డాక్యుమెంట్ నెం. 1067/1993 బిచ్చిరెడ్డిపాలెం బస్టాండు వద్ద జెరాక్స్ సెంటర్ నందు పోయినది. ఎవరికైనా ఈ డాక్యుమెంట్ దొరికినయెడల క్రింది అడ్రస్సుకు సంప్రదించవలసినదిగా కోరుచున్నాం.

వింజం మాలకొండయ్య
సెల్ నెం.8985864862

సం/- బి.నరసింహారావు B.A., B.L
అడ్వకేట్ & నోటరీ
సెల్ నెం. 9848414967



రైల్వే గేటు వద్ద ఖాళీ స్థలంలో చిన్నచిన్న గుడారాలు వేసుకొని జీవనం సాగిస్తున్న 30 కుటుంబాల వారికి ఎగ్ బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు ఎస్.కె.ఖాదర్‌బాషా మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం నుండి జీవనోపాదికి వారి కు టుంబాలతో వచ్చి దేవుడు విగ్రహాలు తయారు చేసి ఇతర ప్రాం తాలకు వెళ్లి అమ్ముకొని జీవనం సాగిస్తున్న వారిలో ఎక్కువ మంది ముస్లింలు వున్నారన్నారు. రంజాన్ మా సమైనందున ఉపవాసాలు వుంటున్నారని వారందరికీ ట్రస్ట్ అధ్యక్షులు ఎగ్‌బిర్యానీ అందజేయడం సంతో షమని అభినందనలు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ సేవా సం స్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్‌బీ, బి.వి.ంత్నమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు యం.వి.ప్రసాద్‌రావు, రహీం ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్ అలీం తదితరులు పాల్గొన్నారు.

## జివో నెంబర్ 52ను తక్షణమే రద్దు చేయాలి



**కందుకూరు, మార్చి31, ప్రభాతవార్త** బోయ, వాల్మీకి, బెంత, ఒరియాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ వైసిపి ప్రభుత్వం జాబితాలో చేరుస్తూ వైసిపి తీసుకుని వచ్చిన జివో నెంబర్ 52ను రద్దు చేయాలని కందుకూరు గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఆ సంఘంజిల్లా నాయకులు చేవూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ బొమ్మవద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సామాజిక వేత్త పాలేటి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులాల మధ్య చిచ్చుపెట్టి ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలని చూస్తున్నట్లు ఆరోపించారు. ఇందుకోసం హడావుడిగా జివో నెం 52ను తీసుకునివచ్చారని ఆయన విమర్శించారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని గిరిజనులకు అన్యాయం చేయకూడదని చెప్పారు. ప్రభుత్వ చర్యను పలువురు గిరిజన సంఘాల నాయకులు తప్పుపట్టారు.

## కమ్యూనిటి సమస్యల్ని ఒకే వేదికపై పరిష్కరించడమే సార్డ్స్ సంస్థ ధ్యేయం




**కావలి, మార్చి 31 ప్రభాతవార్త** కమ్యూనిటి సమస్యలను ఒకే వేదికపై పరిష్కరించడమే సార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయంగా పెట్టుకొని పనిచేస్తుందని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ పిఎఫ్‌వో భూషణబాబు తెలిపారు. కావలి పట్టణ క్రిస్టియన్‌పేట మొదటి లైన్‌లోని కార్యాలయంలో శుక్రవారం అడ్వకసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పిఎఫ్‌వో భూషణబాబు మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ట్రాన్స్‌జెండర్స్‌కు, సెక్స్‌వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ కమ్యూనిటి సమస్యలు పరిష్కరించుకునేందుకు సూచనలు, సలహాలు అందజేస్తామన్నారు. ప్రాజెక్టు మేనేజర్ జె.బెనోమి మాట్లాడుతూ కమ్యూనిటి సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించేందుకు ఒకే వేదికపై వివిధ శాఖల అధికారుల చేత అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి, టుటౌన్ ఎస్ఐ మాల్యాద్రి, రెవెన్యూ ఆర్ఐ శివ, వైసిపి వార్డు ఇన్‌చార్జ్ నున్నా మురళి, సార్డ్స్ సిబ్బంది శివ, మానస, హేమలత, ప్రశాంతి, నీరజ, పద్మజ, తదితరులు పాల్గొన్నారు. వేదికపై ఆశీనులైన వారికి పూల మొక్కల కుండీలు అందజేసి దుశాలువాలతో సత్కరించారు.

## ఎస్టీ జాబితాలో బోయ కులస్తుల్ని చేర్చి గిరిజనుల నోళ్ళు కొట్టొద్దు




**కావలి, మార్చి 31 ప్రభాతవార్త** ఎస్టీ జాబితాలో బోయ కులస్తుల్ని చేర్చి గిరిజనుల నోళ్లు కొట్టవద్దని పలువురు నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ చర్యల్ని నిరసిస్తూ కావలి జాతీయ రహదారిపై ఏరియా వైద్యశాల ఎదురుగా వున్న అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపూరు కృష్టయ్య, ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొగలి కల్లయ్య, జిల్లా నేత బోగిరి యోహాన్, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి, చలంచర్ల రాజా, గిరిజన, యానాది సంక్షేమ సంఘం నేత కత్తి ఆదిశేషయ్యలు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం నిర్వహించిన ధర్నాలో మా ట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ జాబితాలో బోయల్ని చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తెలిపారు. దీనివల్ల 40 లక్షల మంది గిరిజనుల నోళ్ళు కొట్టినట్లయిందన్నారు. ఎస్టీలలో వున్నటువంటి గిరిజనులు విద్యాపరంగా, ఉద్యోగపరంగా అవకాశాలు లేక తల్లడిల్లుతున్న పరిస్థితులలో పుండు మీద కారం చల్లినట్లుగా గిరిజనుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు.

గిరిజనులకు వచ్చే ఒకటి రెండు ఉద్యోగాలు కూడా ప్రభుత్వ నిర్ణయం వల్ల గండిపడే ప్రమాదం వుందన్నారు. రాయలసీమలో వున్న బోయ కులస్తులను మరలా ఎస్టీ జాబితాలో చేర్చినందు వల్ల గిరిజనుల అభ్యున్నతికి తీవ్ర స్థాయిలో గండిపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత జిల్లాల్లో యానాదుల పరిస్థితి చాలా దుర్భరంగా వుందన్నారు. ఇప్పటికి చేప పిల్లలను పట్టుకొని జీవిస్తూ దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితులలో బోయ కులస్తులను చేర్చడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ఎస్సీ,ఎస్టీ రెండు కార్పొరేషన్లు మూతవేసి ఆర్థికంగా జగన్ ప్రభుత్వం అణగదొక్కిందన్నారు. రిజర్వేషన్లలో కూడా ఇతర కులాలను చేర్చడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## కళ్యాణం ...కమనీయం... శ్రీ ఆత్మారామస్వామి వారి కళ్యాణ వైభోగం



**సంగం మార్చి 31 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ ఆత్మారామస్వామి వారి సన్నిధిలో శ్రీరామనవమి పుర స్కరించుకొని రాత్రి అత్యంత వైభ వంగా శ్రీ సీతా లక్ష్మణ సమేత ఆత్మరామస్వామి వారి కళ్యాణం కన్ను ల పండుగగా నిర్వహించారు. మంగ ళవాయిద్యాలు.... వేదమంత్రోచ్చ రణ నడుమ స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిం చా రు. కళ్యాణం ఉభయకర్తలుగా పులగం కృష్ణారెడ్డి ,గిరిజమ్మ ,పులగం అరవింద్‌రెడ్డి,సుమన దంపతులు వ్యవ హారించారు.కార్యక్రమాలను పొన్నలూరు శివకు మార్‌రెడ్డి,బండా హరికిషోర్‌రెడ్డి పర్యవేక్షించారు. ప్రసాదాల ఉభయకర్తలుగా పగడాల సుబ్బారావు పగడాల హరి,పగడాల జానకిరామ్ దంపతులు వ్యవహారించారు.

## సమాచార చట్టాన్ని దుర్వినియోగం చేస్తే చర్యలు



**సైదాపురం మార్చి 31 ప్రభాతవార్త** ఎవ్వరైనా సమాచారా చట్టాన్ని దుర్వినియోగానికి పాలుపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఇన్‌పర్‌మేషన్ కమీషనర్ యు హరిప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు.మండల పరిధిలోని తుమ్మల తలుపూరు గ్రామంలో ఒ ప్రవేటు కార్యక్రమం ఆయన శుక్రవారం పాల్గోన్నారు అనంతరం మీడియాతో మాట్లాడుతు సమాచార చట్టం అనేది ప్రభుత్వానికి ప్రజలకు వారదిలాంటిదని ఆ చట్టాన్ని కొంతమంది దుర్వినియోగానికి పాలుపడుతున్నారని వారిని గుర్తించి ప్రత్యేకమైన వ్యవస్దను తీసుకొని వస్తున్నామని దీంతో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ముఖ్యంగా భూసమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసిల్దారు విజయలక్ష్మీ, ఎస్ఐ నాగబాబు,తదితరులున్నారు.

## అల్లూరులో శ్రీరాములోరి రథోత్సవం



**అల్లూరు, మార్చి 31 ప్రభాతవార్త** అల్లూరుపేటలో వెల సి వున్న శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శుక్ర వా రం శ్రీరామ నవమి ఉత్స వాలలో భాగంగా రథో త్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం రాములోరికి ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ప్రత్యేక పూ జలు, అభిషేకాలు అనంతరం రాముల వారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, బాణా సంచాల శబ్దాల నడుమ గ్రామ వీధుల్లో విహరించిన రాముల వారు ప్రజలకు దర్శనమిచ్చారు.ఈ రథోత్స వాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు అల్లం పాటి ఇందిరమ్మ, లోకేష్‌బాబు ఉత్స వాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు.ఈఉత్స వంలో కెఎస్‌ఆర్ ఫౌండేషన్‌వారు ప్రజలకు మజ్జిగప్యాకెట్లు, ప్రసాదాలు అందజేశారు.

## ఎమ్మెల్సీ శ్రీకాంత్ ప్రమాణస్వీకారాణికి తెలుగు తమ్ముళ్లు హాజరు



**కందుకూరు,మార్చి31,ప్రభాతవార్త** తూర్పు రామలసీమ పట్టభద్రుల శాసన మండలి సభ్యులుగా డాక్టర్ కంచర్ల శ్రీ కాంత్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశా రు.శాసనమండలి సమావేశ ప్రాం గణం లో చైర్మన్ మోషేరాజు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.ఇందుకోసం కందు కూరు నియోజకవర్గం నుంచి తెలుగు దేశం నాయ కు లు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.టిడిపి ఇన్‌చార్జిఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం నా యకులు ర్యాలీగాబయలుదేరి వెళ్లా రు.అంతకు మునుపుజాతీయ పార్టీ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయు డిని కలిసారు.పార్టీ ప్రధాన కార్యా లయంలో రాష్ట్ర నేతలనుకూడా కలుసుకున్నారు.కందుకూరు ఇన్‌చార్జి నాగేశ్వరరావు కార్యాలయంలో నియో జకవర్గాలకు చెందిన పలువురు నేతలు వచ్చారు.అక్కడకు ఎమ్మెల్సీ శ్రీకాంత్ రావడం జరిగింది.ఆయన అంక మ్మగుడిలో పూజా కార్యక్రమాలునిర్వహించి టిడిపి కార్యాలయానికి మిత్రులతో కలిసి వచ్చారు.నాగేశ్వరరావు సమక్షంలో జెండా ఊపి రా ్యలీని ప్రారంభించారు.

## కందుకూరులో మాజీ ఎమ్మెల్యే పోతల పర్యటన



**కందుకూరు,మార్చి31,ప్రభాతవార్త** టిడిపి నేత మాజీ శాసనసభ్యులు పోతల రామారావు శుక్రవారం కందుకూరు వచ్చారు.చాలా రోజు ల తర్వాతఆయన కందుకూరు నియోజ క వర్గంలో అడపాదడపా పర్యటిస్తూ వస్తున్నా రు.ఇటీవల టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిట వెంకటేశ్వర్లు మనవడు సుమిత్ ఆర్య న్ పుట్టినరోజు వేడుకలకు పోతలను ఆహ్వా నించారు.వక్తిగత పనులమీదు ఆయన సు దూర ప్రాంతాల్లో ఉండటంతో ఈ కార్యక్ర మానికి రాలేకపోయారు.శుక్రవారం కందుకూరు వచ్చి పిడికిట వెంకటేశ్వర్లు స్వగృహానికి వెళ్లి కుటుం బసభ్యులతో మాట్లాడి సుమిత్‌ను ఆశీర్వదించారు.అక్కడికి వచ్చిన పలువురు తెలుగుదేశం నేతలతో ముచ్చటించారు.అందరినీ అప్యాయంగా పలకరించారు.తదుపరి ఆయన ప్రధాన అనుచరుడు మస్తాన్‌వలీ తండ్రి చాంద్‌భాషా ఇటీవల స్వర్గస్తులు కావడంతో పట్టణంలోని సంతోష్‌నగర్‌లోఉంటున్న వారి కుటుం భ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.ఆయన వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌ఉప్పుటూరి శ్రీని వాసరావు,తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్,టిడిపి నేతలు వడ్డెళ్ల రవిచంద్ర, మంగపాటి శ్రీనివాసులు,సోమినేని కొండలరావు,కంద్రా యువరత్న,మాదాల రవీంద్ర,చేబ్రోలు శ్రీనివాస రావు తదితరులు ఉన్నారు.

## బుల్లెట్ వాహనాలపై ఉక్కు పాదం మోపుతున్న నెల్లూరు జిల్లా పోలీసులు



**నెల్లూరు క్రైమ్,మార్చి31,ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో బుల్లెట్ వాహనాలకు అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లు అమర్చుకొని ధ్వని కాలుష్యానికి కారణం అవుతున్నారనే ఉద్దేశంతో గత రెండు నెలలుగా జిల్లా ఎస్పీ విజయరావు నేతృత్వంలో క్రైమ్ అడిషనల్ ఎస్పీసుభాన్‌భాషా మరియు ట్రాఫిక్ డిఎస్పీ సుభాన్‌భాషా మరియు ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా అధికశబ్ధం వచ్చే సైలెన్సర్లు అమర్చుకుని వాహన శబ్ధం వచ్చే సైలెన్సులు అమర్చుకుని వాహనాలు నడుపుతున్న వారిపైఉక్కు పాదం మోపి ఆ సైలెన్సర్లు తొలగించి ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు.ఇకమీదట ఎవరైనాకంపెనీ వచ్చే సైలెన్స్ బిగించుకొని వాహనాలు నడిపితే అట్టి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లు అమ్మిన షాపు యజమానులపై బిగించిన మెకానిక్‌లపై కూడా చర్యలు తీసుకుం టామని స్పష్టం చేశారు.గత రెండు నెలలుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధిక శబ్ధంవచ్చే 420సైలెన్సర్లు తొలగించామని వాటిని లేఔట్‌లో ధ్వంసం చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ట్రాఫిక్‌పోలీసులు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చినా,తాగి వాహనాలు నడిపిక కఠిన చర్యలు తీసు కుంటా మనితెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రిఫిక్ డిఎస్పీ సుభాన్‌భాషా,సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రమౌళి,రంగనాథ్,నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కారు-ఆటో ఢీ -ఒకరు మృతి



**బుచ్చి మార్చి 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని సాల్మాన్‌పురం వద్ద కారు ఆటో ఢీకున్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. నెల్లూరు వైపు వెళుతున్న కారు బుచ్చివైపు వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు.విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్ధలానికి చేరుకున్నారు. ఆటోలో ఉన్న వ్యకి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు మినల్లు గ్రామానికి చెందిన సదాశివరెడ్డి అని పోలీసులు తెలిపారు.ఆటో డ్రైవర్ వీరయ్య పరిస్ధితి విషయమంగా ఉందని తెలిసింది. కారు డ్రైవర్ పరారయ్యాడు. కారులో ఉన్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కామాక్షితాయికి కానుకగా ముక్కుపుడక



**బుచ్చి మార్చి 31 ప్రభాతవార్త** పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారికి శ్రీపాద కానుకగా బంగారు ముక్కుపుడక,మంగళసూత్రం,చిన్న వెండి గిన్నె వస్తువులను భక్తులు దేవస్ధానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు చేతులు మీదుగా హుండిలో సమర్పించారు.ఈ సందర్భంగా చైరె ్మన్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

## అందరి ముఖ్యమంత్రి జగనన్న



**అనంతసాగరం ,మార్చి31ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలో ఎపిఎం వెంకటరమణరావ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొదుపు మహిళలకు 3వ విడత వైఎస్ఆర్ ఆసరా చెక్‌పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈసందర్భంగా తొలుత వైఎస్ఆర్‌సిపి క్రాంతి పథకం ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి పలువురు లబ్ధిదారులతో మాట్డాఆరు. అనంతరం స్థానిక ప్రజా ప్రతి నిధులు, అధికారులు, మహిళలతో కలసి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశా రు.అనంతరం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ పేద , బడుగు, బలహీన వర్గాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి సంక్షేమంతోపాటు ఆర్థికంగా అభివ ృద్ధిని సాధించేందుకు తోడ్పాటునందిస్తున్నారన్నారు. విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతునాన్రి ఆయన బాటలోనే ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా అనంతసాగరం మండలంలో త్వరలోనే 10డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో అనంతసాగరం బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో దాతల సహకారంతో 500మందికి రోజు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎపిఎం రమణరావ్ మాట్లాడుతూ మండలంలో 3వ విడత వైఎస్ఆర్ ఆసరా మంజూరైన 516 స్వయం సహాయక సంఘాలకు 4.76కోట్ల రూపాయల లబ్ధి చేకూరనుందన్నారు. జడ్పీటిసి సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, మండలాధ్యక్షురాలు పెయ్యల సంపూర్ణ, మండల సచివాలయాల కన్వీ నర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## డివైడర్‌ని ఢీకొట్టిన కారు...ఇద్దరు మృతి





**కావలి రూరల్, మార్చి 31 ప్రభాతవార్త** కారు అతి వేగంగా డివైడర్‌ని ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. కావలి రూరల్ మండలం సర్వాయపాళెం క్రాస్‌రోడ్డు వద్ద పెట్రోలు బంకు పక్కన జాతీయ రహదారిపై శుక్రవారం చెన్నై నుండి ఒంగోలుకు బొర్రా ప్రవీణ్, భార్య ప్రియాంక, అత్త భారతి, 8 సంవత్సరాల కుమారుడు కారులో వెళ్తున్నారు. కారు అతివేగంగా అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రియాంక(30), భారతి (55)లు అక్కడికక్కడే మృతి చెందారు. కారు పల్టీలు కొట్టింది. కావలి రూరల్ ఎస్ఐ వెంకట్రావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


# నిషేధిత భూముల జాబితా నుంచి కావలి ప్రజల్ని కాపాడాలి

**కావలి, మార్చి 31 ప్రభాతవార్త** నిషేధిత భూముల జాబితా నుంచి కావలి ప్రజల్ని కాపాడాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి కార్యదర్శి, సీనియర్ ఐఎఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డిని ఆయన కార్యాలయంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. కావలి పట్టణంలోని 8 వేల కుటుంబాలకు చెందిన నివాస గృహాలను, ఇంటి స్థలాలను 2018లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం నిషే ధిత భూముల జాబితాలో పెట్టిందని తెలిపారు. దీంతో నాటి నుంచి నేటి వరకు కావలి ప్రజలు సమస్యల వలయంలో చి క్కుకొని అవసరాలకు ఉపయోగపడకపోవడంతో తల్లడిల్లి పోతున్నారని తెలిపారు. కావలి పట్టణంలో 40 ఏళ్ళ నుంచి, 70 ఏళ్ల కితం తాత, ముత్తాతలు కొనుగోలు చేసిన ఇంటి ఆస్తులను ఆర్థిక అవసరాల కోసం నేటి తరం వారు అమ్ముకోలేక,బాగాలు పంచుకోలేక నరకయాతన పడుతున్నారన్నారు. చంద్రబాబునాయుడు కావలి ప్రజలపై పగబట్టి దుర్మార్గంగా ప్రవర్తించారన్నారు. అటవీశాఖ 45 ఏళ్ళ క్రితం ఈ భూములను వదు లుకున్నట్లు విడుదల చేసిన జీవోలు తీసుకురమ్మంటున్నారని తెలి పారు. ఆ జీవోలు అట వీశాఖ వద్దే లేకపోతే ప్రజల వద్ద ఎలావుంటాయని ఎమ్మెల్యే కార్యదర్శికి వివరించారు. నిషేధిత భూముల జాబితా నుంచి కావలి పట్టణంలోని వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్, జన తాపేట, వైకుంఠపురం తదితర ప్రాంతాల ప్రజల్ని కాపాడాలని ఆయన కోరారు.



# జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిత్య అన్నదానం ప్రారంభం

**ఆత్మకూరు ,మార్చి31ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరమని ఆత్మకూరు నియోజకవర్గ శాసనస భ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు ము న్సిపల్ పరిధిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డితో కలసి ఆయన లాంచనంగా ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మా ట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేసేందుకు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా అందరిని ఒకే వేదికపై తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నా మన్నారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటుకు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నా మని, ఏప్రిల్ నాటికి 100 డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిహెచ్‌సిలో ఆధునిక సదుపాయాలను సైతం ఏర్పాటు చేసేందుకు అనేకమంది ముందుకు వస్తునాన్రి వారందరి సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రధానంగా అభివృద్ధి సాధించేందుకు దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ఇప్పటికే మున్సిపల్ బస్టాండు నిర్మాణం పూర్తి కావచ్చిందని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగుల కోసం నిత్యాన్నదానం ఏర్పాటు చేసిన కంచి పరమేశ్వరరెడ్డిని అందరూ అభినంఇచంఆలని, ఇలా ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాలకు సహాయ సహకారాలు అందిస్తే నియోజకవర్గంలో ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా పరిష్క రించుకోవచ్చున్నారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డిని ట్రస్ట నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.



# మహిళాసాధికారతే ముఖ్యమంత్రి లక్ష్యం

**వలేటివారిపాలెం మార్చి 30, ప్రభాతవార్త** మహిళా సాధికారత సాధనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని స్దానిక ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి అన్నారు. ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులును సైతం అధిగమించి అక్కచెల్లెమ్మల లక్షాధికారులును చేయా లన్న ఉద్దేశ్యంతో వివిధ పథకాల అమలు ద్వారా సుమారు రూ.2లక్షల కోట్లు వెచ్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.శుకృవారం వలేటివారిపాలెం మండలం లోని 8730 మంది పొదుపు మహిళలకు ఆసరా పథకం మూడో విడతలో బాగంగా రూ.6.66కోట్లు నిధులకు సంబందించిన చెక్కును ఆయన మండల సమాఖ్యసభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కందుకూరు ఏపీఎం శ్రీనివాసులు అధ్య క్షతవహించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ జీవనశైలిలో మహిళల నిబద్ధత, విశ్వసనీయత,పట్టుదల ప్రశంసనీయ మన్నారు.ఇందులోబాగంగానే రూ.5లక్షల రుణపరిమితి నేడు రూ.20లక్షలకు చేరిందన్నారు.అయినా అవినీతి, అక్రమాలకు తావులేకుండా లోను రికవరీ 100శాతం ఉందన్నారు.ఈ నేపద్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మహిళాభివృద్ధి, సంక్షేమము పట్ల ఎనలేని మక్కువ కలదన్నారు.ఇందులోబాగంగా వారి ఆదేశాల మేరకు మూడో విడత చెల్లించాల్సి న రూ.6.66కోట్లు నిధులకు సంబందించిన చెక్కులను అక్కచెల్లెమ్మలకు అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మౌనిక,జెడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎమ్మెస్ అధ్యక్షురాలు ముప్పా హరితలు తొలుత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు.ఎన్నికల హామీ మేరకు సభ్యుల బ్యాంక్ లింకేజి రుణబకాయిని క్రమం తప్పకుండా అందిస్తున్నట్లు తెలిపారు.ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సతీష్, దేగా బుజ్జి, వింజం వెంకటేశ్వర్లు,ఎంపీటీసీలు చింతలపూడి రవీంద్ర,సిహెచ్ యానాది,వైసీపీ నేతలు పరిటాల వీరాస్వామి, అనుమోలువెంకటేశ్వర్లు, అనుమోలు లక్ష్మీనరసింహం ,కాకు వెంకటస్వామి, గురిజాల కిష్టయ్య ,గుత్తా గోపి,యాళ్ల శివకుమార్‌రెడ్డి,సంజీవరెడ్డి, నలదలపూరు ఉన్నం వెంకటేశ్వర్లు,రోళ్లపాడు వేణు, శివరామిరెడ్డి, బాపతు మాలకొండారెడ్డి,కట్టా హనుమంతరావు,అయ్యవారిపల్లె కొండలరావు,పెయ్యల మల్లిఖార్జునరావు,కూచిపూడి విజయకుమార్, శ్రీదేవిలతోపాటు వివిద గ్రామాలనుంచి పొదుపు మహిళలు,వైసీపీ కార్యకర్తలు వెలుగు సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

